



Regd.No : AP-03-0000025

# సింహగర్జన

www.simhagarjana.com






ప్రచురణ : పిఠాపురం సంపుటి : 2 సంచిక : 614 ఎడిటర్ : డా. సునీల్ కుమార్ యాండ్ర మంగళవారం 16 డిసెంబర్ 2025 పేజీలు : 4 వెల : అమూల్యం


## అమరావతిలో 'స్టాట్యూ ఆఫ్ శాక్రిఫైస్' నిర్మిస్తాం

గత ప్రభుత్వం మూడు రాజధానుల పేరుతో రాష్ట్రాన్ని అపహాస్యం చేసింది

పశ్చిమ గోదావరి జిల్లా పెనుగొండ మండలం పేరు 'వాసవీ పెనుగొండ'గా మార్పు

పీపీపీ విధానంలో మెడికల్ కాలేజీలపై విపక్షాల విమర్శలను తిప్పికొట్టిన సీఎం

4



## తాడిపత్రిలో మళ్లీ రాజకీయ వేడి..

పెద్దారెడ్డికి జేసీ ప్రభాకర్ రెడ్డి సవాల్

-కేతిరెడ్డి ఫిర్యాదుపై స్పందించిన మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి

-అక్రమ నిర్మాణాలు నిరూపిస్తే కూల్చేందుకు సిద్ధమని ప్రకటన

-రేపు పెద్దారెడ్డి తండ్రి విగ్రహానికి వినతిపత్రం ఇస్తామన్న జేసీ

4



## బాలు కేవలం గాయకుడే కాదు, బహుముఖ ప్రజ్ఞాశాలి

-ఎస్పీ బాలుకు అసలైన నివాళి అదే: మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

-హైదరాబాద్ రవీంద్రభారతిలో ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం కాంస్య విగ్రహావిష్కరణ

-ముఖ్య అతిథిగా పాల్గొన్న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

-ఆయన గళం సంగీత దర్శకులకు ఒక అక్షయపాత్ర అని ప్రశంస

-మన భాషా సంస్కృతులను కాపాడుకోవడమే ఆయనకు నిజమైన నివాళి అని పిలుపు

4



గాన గంధర్వుడు, బహుముఖ ప్రజ్ఞాశాలి స్వర్గీయ ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం జ్ఞాపకార్థం హైదరాబాద్‌లోని రవీంద్రభారతి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కాంస్య విగ్రహాన్ని భారత మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు సోమవారం ఆవిష్కరించారు. తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, ఎస్పీబీతో తనకున్న అనుబంధాన్ని, ఆయన గొప్పతనాన్ని స్మరించుకున్నారు. అశేష ప్రజల అభిమానాన్ని పొందిన గొప్ప వ్యక్తి విగ్రహాన్ని ఆవిష్కరించడం సంతోషంగా ఉందని తెలిపారు.





## 2029 ఎన్నికల్లో పోటీ చేస్తాం: కవిత

-జాగృతిని రాజకీయ పార్టీగా మార్చే దిశగా సంకేతాలు

-గ్రామస్థాయిలో జాగృతి కమిటీలు ఏర్పాటు చేస్తామన్న కవిత

-కొత్త పార్టీ పేరుపై నెటిజన్ ప్రశ్నకు ఆసక్తికర సమాధానం



## ఆహా ...ఏమి"టీ"

విజయనగరం, సింహగర్జన ప్రతినిధి, డిసెంబర్ 15 : కాలం ఏదైనా... సమయం ఎంతైనా.. "టీ" అంటేనే అందరికీ నోరూరుతుంది. ఉదయం లేవగానే వేడివేడిగా.. మధ్యాహ్నం స్నేహితులతో సరదాగా... సాయంత్రం సమయాన మనసును ఉల్లాసంగా చేసుకోవడానికి... ఇలా అనేక సందర్భాల్లో టీ ఉపయోగపడుతుంది. ఇంటికొచ్చిన బంధుమిత్రులకు భోజనం మాట ఎలా ఉన్నా ఆప్యాయంగా ఓ కప్పు టీ అందిస్తే ఆ ఆనందమే వేరు. కాస్త తలనొప్పి అనిపిస్తే వేడివేడి టీ తాగగానే ఎంతటి వారికైనా ప్రాణం లేచొచ్చినంత పని అవుతుంది. ఇలా టీ అనేది అందరి జీవితాల్లో భాగస్వామ్యం అయిపోయింది. ఏమి"టీ" కబుర్లు అనుకుంటున్నారా..? నేడు ప్రపంచ టీ దినోత్సవం. అందుకే దానిగురించి నాలుగు మాటలు. పోటీ ప్రపంచంలో కాలం వేగంగా మారిపోతున్నా సమాజంలో టీ కి లభిస్తున్న ఆదరణ ఏ మాత్రం తగ్గడం లేదు. ఆనాడు ఆంగ్లేయులు భారతీయులకు అలవాటు చేసారు ఈ టీ ని. ఆనాటి నుంచి నేటి వరకు టీ ప్రియులు పెరుగుతున్నారే తప్ప తగ్గడం లేదు. మారుమూల గ్రామాల్లో ఉండే కాకా హోటల్ నుంచి పట్టణాల్లో ఉండే నక్షత్రాల హోటల్ వరకు ఈ ఛాయ్ దే అగ్రస్థానం. ధరల పెరుగుతున్నా వినియోగం ఏ మాత్రం తగ్గడం లేదు. కాలంతో పాటే రకరకాల టీ లు పుట్టుకొస్తున్నాయి. స్తోమతను బట్టి ఈ టీ అందుబాటులో దొరుకుతుంది. వాటిల్లో బ్లాక్ టీ, మసాలా టీ, లెమన్ టీ, గ్రీన్ టీ, బెల్లం టీ వంటి ఎన్నో రకాల టీ లు ప్రస్తుతం గ్రామీణ ప్రాంతంలో కూడా అందుబాటులోకి వచ్చాయి. వీటిలో ఒక్కొక్క దానికి ఒక్కొక్క విశిష్టత ఉంది. ఎవరి అభిరుచికి తగ్గట్టుగా టీ లను తయారు చేసి ఇచ్చే టీ స్టాల్స్ ఇటీవలి విపరీతంగా పెరుగుతున్నాయి. ఈ "టీ" ఆరోగ్యానికి మంచిదా చెడ్డదా అనేదానిపై అనేక చర్చలు జరుగుతూ ఉంటాయి. ఆరోగ్యానికి పెద్దగా ప్రయోజనం లేదని వాదన బలంగా వినిపిస్తుంది. కాని వాడడం మాత్రం ఎవరూ ఆపరు. షుగర్ వ్యాధి వెంటాడుతున్నప్పటికీ ఆ షుగర్ ని తగ్గించమంటారు తప్ప వదిలిపెట్టడానికి ఎవరూ ఇష్టపడడం లేదు. రోగులకు టీ తాగొద్దని సూచించే వైద్యులు కూడా టీ తాగడాన్ని బట్టి దీని ప్రత్యేకత స్పష్టమవుతుంది. అందరికీ ప్రపంచ టీ దినోత్సవ శుభాకాంక్షలు.



# వేద సంస్కృతి సమితి ఆధ్వర్యంలో సనాతన ధర్మ పరిరక్షణ దిశగా కీలక అడుగు

హైదరాబాద్, సింహగర్జన ప్రతినిధి, డిసెంబర్ 15 : వేద సంస్కృతి సమితి (వి.ఎస్.ఎస్) ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమం సనాతన ధర్మ పరిరక్షణ, పునరుజ్జీవన లక్ష్యాలను సమగ్రంగా ప్రజలకు పరిచయం చేసే దిశగా ఒక విశేష ఘట్టంగా నిలిచింది. ఈ సందర్భంగా వి.ఎస్.ఎస్ %–% ప్రొటెక్షన్ ఆఫ్ సనాతన ధర్మ అనే భావనను అధికారికంగా వివరించడమేగాక, భవిష్యత్ కార్యాచరణకు బలమైన పునాది ఏర్పడింది. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలతో పాటు తమిళనాడులోని అరుణాచలం ప్రాంతానికి చెందిన అనేక మంది సాధువులు, మఠాధిపతులు హాజరయ్యారు. వీరితో ఏర్పడిన విలువైన అనుబంధానికి ముఖ్య కారణంగా వల్లూరి హరిగోపాల్ నిలిచారు. ఆయన ద్వారా లభించిన పరిచయాలు, మార్గదర్శకత్వం వేద సంస్కృతి సమితికి ఒక శక్తివంతమైన అవకాశంగా మారాయి. ఈ సమావేశం ద్వారా భవిష్యత్తులో సనాతన ధర్మంపై మహా సదస్సు నిర్వహించేందుకు అవకాశాలు మెరుగుపడ్డాయని వి.ఎస్.ఎస్ ప్రతినిధులు తెలిపారు. ప్రముఖ పండితులు, ఆచార్యులు, ధార్మిక నాయకుల సమక్షంలో ప్రాచీన జ్ఞానం, భారతీయ సంస్కృతి, వారసత్వ పరిరక్షణ అంశాలపై విస్తృత చర్చ జరగనుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి జ్ఞాన దేవతా మఠం సరస్వతి, మాతా త్రిపురాంతకేశ్వరి దేవి, శ్రీశైలం మల్లికార్జున%–%భ్రమరాంబ దేవి తదితర దేవతల అనుగ్రహం ఉందని, ప్రాచీన జ్ఞాన పునరుద్ధరణ లక్ష్యం ఈ సందర్భంతో మరింత వేగం పుంజుకుందని వి.ఎస్.ఎస్ ప్రతినిధులు భావవ్యక్తం చేశారు. ప్రపంచ స్థాయిలో భారతీయ సాంస్కృతిక పునరుజ్జీవనానికి దోహదపడేలా ఒక దూరదృష్టి గల వేదికను అందించినందుకు వేద సంస్కృతి సమితి వ్యవస్థాపకులు శ్రీమాన్ ఆకెళ్ళ హేమకాంత ప్రభాకర రావు మహోదయులకు ఈ సందర్భంగా ప్రత్యేక




కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ ఉద్యమం ఒక సంస్థ స్థాయిని దాటి, సనాతన ధర్మ పరిరక్షణకు అంకితమైన ఉద్యమంగా రూపుదిద్దుకుంటోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి వేద సంస్కృతి సమితి తరపున ఎగ్జిక్యూటివ్ సెక్రటరీ లలిత బీకే హాజరై, వి.ఎస్.ఎస్ సనాతనుల తరపున కార్యక్రమంలో పాల్గొన్నారు.

# బాలు కేవలం గాయకుడే కాదు, బహుముఖ ప్రజ్ఞాశాలి

ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు మాట్లాడుతూ, బాలసుబ్రహ్మణ్యం కేవలం స్వర సార్వభౌముడు మాత్రమే కాదని, ఆయన గొప్ప సంస్కారవంతుడని, నిరాడంబరుడని కొనియాడారు. ఆయన గాత్రంలో నవరసాలు నాట్యం చేసేవని, ఆయన ఆలపించిన ప్రతీ పాట భావ జలపాతమని అభివర్ణించారు. "సంగీత దర్శకులు, గేయ రచయితలు ఏది కోరుకుంటే అది పలికించే ఒక అక్షయపాత్ర ఆయన గళం. ఎంతో మంది నటుల నటనా శైలికి, వారి హావభావాలకు అనుగుణంగా గాత్రధర్మాన్ని మార్చుకుని పాడటం ఆయనకు మాత్రమే సాధ్యమైంది" అని ప్రశంసించారు.బాలు కేవలం గాయకుడిగానే కాకుండా, డబ్బింగ్ కళాకారుడిగా, నటుడిగా, మార్గదర్శిగా తన బహుముఖ ప్రజ్ఞను ప్రదర్శించారని వెంకయ్యనాయుడు గుర్తుచేశారు. ఆయనలో ఒక గొప్ప వ్యక్తిత్వ వికాస నిపుణుడు ఉన్నారని, 'పాడుతా తీయగా' వంటి కార్యక్రమాల్లో చిన్నారులను ఆయన ప్రోత్సహించిన తీరు అద్భుతమని కొనియాడారు. కేవలం సంగీత పాఠాలే కాకుండా, వారికి జీవిత సత్యాలను బోధిస్తూ, వారిలో సంస్కార బీజాలు నాటేందుకు ప్రయత్నించారని వివరించారు. చిన్నారులకు ఆయన చూపిన మార్గదర్శనం, పెద్దల పట్ల ఆయన చూపిన గౌరవం నేటి తరానికి ఆదర్శనీయమని వెంకయ్యనాయుడు అన్నారు. ఎస్పీబీ భౌతికంగా మన మధ్య లేకపోయినా, ఆయన పాటల రూపంలో చిరస్థాయిగా నిలిచి ఉంటారని పేర్కొన్నారు. మన భాషా సంస్కృతులను పరిరక్షించుకోవడమే మనం ఎస్పీబీకి ఇచ్చే నిజమైన, సార్థకమైన నివాళి అవుతుందని ఆయన పిలుపునిచ్చారు. ఈ గొప్ప కార్యక్రమాన్ని నిర్వహించిన తెలంగాణ ప్రభుత్వ సాంస్కృతిక శాఖను ఆయన ప్రత్యేకంగా అభినందించారు.

# అమరావతిలో 'స్టాట్యూ ఆఫ్ శాక్రిఫైస్' నిర్మిస్తాం

తెలుగు ప్రజల ఆత్మగౌరవం కోసం ప్రాణత్యాగం చేసిన అమరజీవి పొట్టిశ్రీరాములు ఆత్మార్పణ దినాన్ని ఇకపై అధికారికంగా 'డే ఆఫ్ శాక్రిఫైస్' (త్యాగాల దినం)గా నిర్వహిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. ఆయన త్యాగానికి గుర్తుగా రాజధాని అమరావతిలో 'స్టాట్యూ ఆఫ్ శాక్రిఫైస్' నిర్మిస్తామని వెల్లడించారు. సోమవారం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన పొట్టిశ్రీరాములు ఆత్మార్పణ దినం కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా పొట్టిశ్రీరాములు కుటుంబ సభ్యులను శాలువాలతో సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు.

ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. "బ్రిటిష్ వారిపై స్వాతంత్ర్యం కోసం, ఆ తర్వాత తెలుగు వారి ఆత్మగౌరవం కోసం పోరాడిన మహనీయుడు పొట్టిశ్రీరాములు. పాలకుల వివక్షకు గురైన తెలుగు జాతికి ప్రత్యేక రాష్ట్రం కోసం 58 రోజుల పాటు ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణాలర్పించారు. ఆయన కృషితోనే 1953 అక్టోబరు 1న కర్నూలు రాజధానిగా ఆంధ్ర రాష్ట్రం, 1956 నవంబరు 1న ఆంధ్రప్రదేశ్ ఏర్పడ్డాయి. కొందరు ఈ తేదీలపై అనవసర రాజకీయం చేస్తున్నందునే, ఆయన ఆత్మార్పణ చేసిన రోజునే త్యాగాలకు గుర్తుగా నిర్వహించాలని నిర్ణయించాం" అని స్పష్టం చేశారు. పొట్టిశ్రీరాములు ఒక కులానికి చెందిన వ్యక్తి కాదని, యావత్ తెలుగు ప్రజల ఆస్తి, గుండె చప్పుడు అని కొనియాడారు.

పొట్టిశ్రీరాములు స్ఫూర్తిని భావితరాలకు అందించేందుకు ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోందని చంద్రబాబు తెలిపారు. అమరావతిలో స్మృతి వనంతో పాటు, చెన్నైలో ఆయన తుదిశ్వాస విడిచిన భవనాన్ని, నెల్లూరులోని నివాసాన్ని మెమోరియల్స్‌గా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. ఎన్టీఆర్ గతంలో తెలుగు విశ్వవిద్యాలయానికి పొట్టిశ్రీరాములు పేరు పెట్టారని, తాను కూడా నెల్లూరు జిల్లాకు పొట్టిశ్రీరాములు పేరు పెట్టానని గుర్తుచేశారు.

మహా కుట్ర చేశారు

గత వైసీపీ ప్రభుత్వంపై చంద్రబాబు తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. "మూడు రాజధానుల పేరుతో మహా కుట్ర పన్నారు. అసలు రాజధానే లేకుండా చేసి ప్రపంచం ముందు రాష్ట్రాన్ని అపహాస్యం చేశారు. కనీసం రాజధాని పేరు చెప్పుకోలేని దుస్థితి కల్పించారు. కానీ ఇప్పుడు మన రాజధాని అమరావతి అని గర్వంగా చెప్పుకుంటున్నాం" అని అన్నారు. వ్యవసాయంతో పాటు పారిశ్రామిక అభివృద్ధికి కృషి చేస్తున్నామని, 18 నెలల్లోనే రూ.21 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించామని తెలిపారు.

పీపీపీ విధానంలో మెడికల్ కాలేజీల ఏర్పాటుపై వస్తున్న విమర్శలను ఆయన తిప్పికొట్టారు. ఈ విధానం వల్లే రహదారులు, విమానాశ్రయాలు అభివృద్ధి చెందాయని, ఇది పార్లమెంటరీ కమిటీ కూడా సమర్థించిన ఉత్తమ విధానమని అన్నారు. కాలేజీలు ప్రభుత్వ అజమాయిషీలోనే ఉంటాయని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా పశ్చిమ గోదావరి జిల్లా పెనుగొండ మండలం పేరును 'వాసవీ పెనుగొండ'గా మారుస్తూ నిర్ణయం తీసుకున్నట్లు ప్రకటించారు. దీంతో ఆర్యవైశ్య సంఘాల ప్రతినిధులు, మహిళలు ప్లకార్డులు ప్రదర్శించి ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. సంక్షేమం, అభివృద్ధికి సమాన ప్రాధాన్యమిస్తూ, తెలుగు జాతిని దేశంలోనే అగ్రస్థానంలో నిలపడమే ఎన్డీఏ కూటమి లక్ష్యమని చంద్రబాబు పునరుద్ఘాటించారు.

# ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం ప్రాణత్యాగం చేసిన అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు కి ఘన నివాళులు అర్పించిన పల్నాడు జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు ఐపీఎస్

పల్నాడు జిల్లా

ఆంధ్ర రాష్ట్ర అవతరణకు తన ప్రాణాలను త్యాగం చేసిన అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు వర్ధంతిని ప్రతి సంవత్సరం డిసెంబర్ 15వ తేదీన "ఆత్మార్పణ దినం"గా ప్రకటిస్తూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల మేరకు, డిసెంబర్15.2025 పల్నాడు జిల్లా పోలీస్ కార్యాలయంలో ఘన నివాళుల కార్యక్రమం నిర్వహించబడింది. పల్నాడు జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు ఐపీఎస్ అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం పోలీస్ అధికారులు, సిబ్బంది రెండు నిమిషాలు మౌనం పాటించి అమరజీవికి తమ గౌరవాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటులో కీలక పాత్ర పోషించిన భారతీయ స్వాతంత్ర్య సమరయోధుడు శ్రీ పొట్టి శ్రీరాములు , తన ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ఆంధ్ర ప్రజల ఆకాంక్షల సాధనకై అహింసాయుత దీక్షతో పోరాడి చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిన మహానుభావుడని అన్నారు. భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు బాటలు వేసినవాడిగా, ఆంధ్రులకు ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించి పెట్టిన త్యాగశీలిగా ఆయనను కొనియాడారు.మహాత్మా గాంధీ బోధించిన సత్యం, అహింస, హరిజనోద్ధరణ వంటి ఆదర్శాలను జీవితాంతం ఆచరించిన వ్యక్తిగా శ్రీ పొట్టి శ్రీరాములు జీవితం ప్రతి తరానికి ఆదర్శమని ఎస్పీ పేర్కొన్నారు. ఆయన త్యాగం వల్లనే నేటి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం రూపుదిద్దుకుందని తెలిపారు.అకుంఠిత దీక్ష, నిస్వార్థ సేవ, లక్ష్య సాధన పట్ల అచంచలమైన పట్టుదల, కార్యదక్షత, అలుపెరుగని పోరాటం వంటి గొప్ప గుణాలను అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు జీవితం మనకు బోధిస్తుందని, పోలీస్ సిబ్బంది సహా ప్రతి పౌరుడు వాటిని తమ జీవితాల్లో ఆచరించాలని ఎస్పీ సూచించారు. ముఖ్యంగా యువత ఆయన త్యాగాన్ని స్ఫూర్తిగా తీసుకొని సమాజ సేవ, దేశ సేవ దిశగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ తో పాటు ఎం టి ఆర్ ఐ యువరాజు మరియు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# 2029 ఎన్నికల్లో పోటీ చేస్తాం

జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తన రాజకీయ భవిష్యత్తుపై కీలక ప్రకటన చేశారు. 2029లో జరిగే ఎన్నికల్లో తాను కచ్చితంగా పోటీ చేయనున్నట్లు స్పష్టం చేశారు. ఎక్స్ వేదికగా ఆమె నెటిజన్లతో 'ఆస్క్ కవిత' పేరుతో క్వశ్చన్ అవర్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నెటిజన్లు అడిగిన పలు ప్రశ్నలకు ఓపికగా సమాధానాలిచ్చారు.ఈ సందర్భంగా ఓ నెటిజన్.. "మీ కొత్త పార్టీ పేరు ఏంటి?" అని ప్రశ్నించగా, "ఎలా ఉండాలో మీరే చెప్పండి" అంటూ కవిత సమాధానమిచ్చారు. ఈ వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తించాయి. త్వరలోనే జాగృతి సంస్థ కార్యకలాపాలను గ్రామస్థాయి వరకు విస్తరిస్తామని, ప్రతి గ్రామంలో కమిటీలను ఏర్పాటు చేస్తామని ఆమె తెలిపారు. జాగృతి సంస్థ ద్వారానే ఎన్నికల బరిలో నిలవబోతున్నట్లు పరోక్షంగా సంకేతాలు ఇచ్చారు.2047 నాటికి దేశ ప్రజలందరికీ నాణ్యమైన ఉచిత విద్య, వైద్యం అందించడమే తన జీవిత లక్ష్యమని కవిత పునరుద్ఘాటించారు. ఇదే తన విజన్, మిషన్ అని ఆమె పేర్కొన్నారు. కవిత తాజా ప్రకటనతో ఆమె భవిష్యత్ రాజకీయ ప్రణాళికలపై చర్చ మొదలైంది.

# ఇది తమిళనాడు... ఇక్కడ బీజేపీ ఎప్పటికీ గెలవదు:

"ఇది తమిళనాడు. ఇక్కడ బీజేపీ ఎప్పటికీ గెలవలేదు. అహంకారం కలిగిన ఏ పార్టీకి ఇక్కడ అవకాశం లేదు. అలాంటి ఏ రాజకీయ శక్తినైనా మేం ప్రతిఘటిస్తాం" అని తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ అన్నారు. బీహార్ అసెంబ్లీ ఎన్నికల తర్వాత తమ లక్ష్యం తమిళనాడు అని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ఇటీవల వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యల నేపథ్యంలో స్టాలిన్ పైవిధంగా మాట్లాడారు.తిరువణ్ణామలై జిల్లాలో జరిగిన పార్టీ యూత్ వింగ్ నార్త్ జోన్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, అమిత్ షా లేదా సంఘ పరివార్ తమిళనాడులో విజయం సాధించలేరని అన్నారు. బీజేపీ తమిళ ప్రజల ఆలోచనను ఎప్పటికీ అర్థం చేసుకోలేదని ఆయన అన్నారు. ప్రేమతో మా వద్దకు వస్తే ఆలింగనం చేసుకుంటామని, అహంకారంతో వస్తే మాత్రం తలవంచే పరిస్థితి లేదని అన్నారు. బీజేపీని నేరుగా ఎదుర్కొని ఓడిస్తామని వ్యాఖ్యానించారు.బీజేపీ వరుసగా మూడవసారి జాతీయస్థాయిలో అధికారంలోకి వచ్చిన తర్వాత మితవాద శక్తులు దూకుడుగా వ్యవహరిస్తున్నాయని ధ్వజమెత్తారు. ఈ శక్తులు ప్రజలను మోసం చేయడానికి తియ్యని అబద్ధాలు చెబుతున్నాయని విమర్శించారు. అలాంటి వారితో పోరాడాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. బీజేపీ ఎప్పటికీ తమిళనాడులో గెలవదని స్టాలిన్ అన్నారు. అందుకే అమిత్ షా చిరాకు పడుతున్నారని పేర్కొన్నారు.తమిళ భాషను, ప్రజలను రక్షించడంతో పాటు భారతదేశ వైవిధ్య, సమాఖ్య విలువలను కాపాడటం కూడా డీఎంకే బాధ్యత అని అన్నారు. బీజేపీకి వ్యతిరేకంగా సైద్ధాంతిక యుద్ధం చేస్తున్న ఏకైక ప్రాంతీయ పార్టీ డీఎంకే మాత్రమే అన్నారు. గెలవడానికి ఇది బీహార్ కాదని, తమిళనాడు అని వ్యాఖ్యానించారు.

# తాడిపత్రిలో మళ్లీ రాజకీయ వేడి..

అనంతపురం జిల్లా తాడిపత్రిలో రాజకీయాలు మరోసారి వేడెక్కాయి. మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి, వైసీపీ మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి మధ్య మాటల యుద్ధం తీవ్రస్థాయికి చేరింది. భూకబ్జా ఆరోపణలపై పెద్దారెడ్డి చేసిన ఫిర్యాదుకు జేసీ ప్రభాకర్ రెడ్డి గట్టిగా బదులిచ్చారు. ఆరోపణలు చేయడం కాదు, దమ్ముంటే వచ్చి అక్రమ నిర్మాణాలు ఎక్కడున్నాయో నిరూపించాలని పెద్దారెడ్డికి బహిరంగ సవాల్ విసిరారు.ఎర్ర కాలువ, రహదారి నిర్మాణంపై కేతిరెడ్డి పెద్దారెడ్డి రెవెన్యూ శాఖకు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో జేసీ ప్రభాకర్ రెడ్డి స్పందించారు. "ఎర్ర కాలువ, రోడ్డు కోసం స్థల యజమానులతో మాట్లాడి ఏడు మీటర్ల స్థలాన్ని పంచాయతీరాజ్‌కు అప్పగించాం. నిధులు లేకపోవడంతో ఆ పనిని ఆర్ అండ్ బీ శాఖకు బదిలీ చేశారు. వారు సింగిల్ రోడ్డును డబుల్ రోడ్డుగా మార్చారు. ఆ ప్రాంతంలోని భూమి మొత్తం ప్రైవేటు వ్యక్తులదే. వారే 20 మీటర్ల స్థలాన్ని రోడ్డు కోసం వదిలి ప్లాట్లు వేసుకున్నారు" అని జేసీ వివరించారు.అయితే, ఇందులో అక్రమ ప్లాట్లు ఎక్కడున్నాయో పెద్దారెడ్డి వచ్చి నిరూపించాలని జేసీ డిమాండ్ చేశారు. ఈ ఆరోపణలను నిరూపించాలంటూ తమ కౌన్సిలర్లు రేపు ఉదయం పెద్దారెడ్డి తండ్రి విగ్రహానికి వినతిపత్రం సమర్పిస్తారని తెలిపారు. "పెద్దారెడ్డి వచ్చి ఏ నిర్మాణం అక్రమమని చూపిస్తే, దానిని కూల్చివేయడానికి నేను సిద్ధం" అని జేసీ ప్రభాకర్ రెడ్డి స్పష్టం చేశారు.

# అనుమతిలేని నిర్మాణాలను, అక్రమ ఫ్లోర్లను తొలగిస్తాం

## - విఎంసి కమిషనర్ ధ్యానచంద్ర హెచ్చరిక

విజయవాడ,

నగరంలో అనుమతులు లేని భవన నిర్మాణాలను తొలగిస్తామని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్చరించారు. సోమవారం చీఫ్ సిటీప్లానర్ కె.సంజయ్‌రత్నకుమార్ సూచనల మేరకు, కార్పొరేషన్ పరిధిలోని పలు అనధికార నిర్మాణాలపై చర్యలు చేపట్టారు.ఈ ప్రక్రియలో బందర్‌కాలువ, నేతాజీ వంతెనలో ఉన్న అనధికార నిర్మాణాలను గుర్తించి తొలగింపు చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ విజయవాడ మునిసిపల్‌కార్పొరేషన్ పరిధిలో ఏవైనా అనధికార నిర్మాణాలు లేదా భవన మార్పులు అనుమతులు లేకుండా చేపడితే వాటిపై తక్షణ చర్యలు తీసుకుంటామని, విఎంసి టౌన్‌ప్లానింగ్ బృందం నిరంతర పరిశీలన చేపడుతోందని, అనధికార నిర్మాణాలను గుర్తించి తొలగించే కార్యక్రమం కొనసాగుతుందని హెచ్చరించారు. నగర ప్రజలు తమ నిర్మాణాలు అనుమతులతోనే చేపట్టాలని, లేనిపక్షంలో విధినిర్వహణ చర్యలు తప్పవని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అనధికార భవనాలను క్రమబద్ధీకరించడానికి 'భవన క్రమబద్ధీకరణ పథకం, 2025(బిపిఎస్–2025)ను గత నెల 12న జిఓఎంఎస్ నంబర్–225ను విడుదల చేసిందని గుర్తు చేశారు. ఈ జీఓ ద్వారా 1985 జనవరి 1వ తేదీ తర్వాత మరియు ఆగస్టు 31, 2025వ తేదీ లోపు నిర్మించిన అనధికార భవనాలు, లేదా ఆమోదిత ప్లాన్‌కు విరుద్ధంగా నిర్మించిన అదనపు నిర్మాణాలు క్రమబద్ధీకరణకు అర్హులని కమిషనర్ తెలిపారు.అర్హులైన భవన యజమానులు దరఖాస్తు చేసుకోవడానికి నియమాలను నోటిఫై చేసిన తేదీ అనగా 12–11–2025నుండి 120రోజుల కాల వ్యవధిని నిర్ణయించారన్నారు. కావున అర్హులైన భవన నిర్మాణదారులు నిర్ణీత గడువులోపు ఆన్‌లైన్ వెబ్‌సైట్ డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.బిపిఎస్.ఏపి.జిఓవి.ఐఎన్'ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. దరఖాస్తులు ఆన్‌లైన్ పోర్టల్ 'డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.బిపిఎస్.ఏపి.జిఓవి.ఐఎన్' ద్వారా మాత్రమే సమర్పించాలని, దరఖాస్తులను అర్హత కలిగిన లైసెన్స్డ్ టెక్నికల్ పర్సనల్(ఎల్‌టీపి)ద్వారా తయారుచేసి,అవసరమైన పత్రాలతో కలిపి ఆన్‌లైన్ మాడ్యూల్‌లో అప్‌లోడ్ చేయాలని,ఈ పథకం కింద 31.12.1997కు ముందు నిర్మించిన భవనాలకు ప్రభుత్వం క్రమబద్ధీకరణ రుసుముపై 25%రాయితీ వర్తిస్తుందని, దీని కోసం 31.12.1997లోపు చెల్లించిన ప్రాపర్టీట్యాక్స్ రశీదు జతపరచాలని,అర్హులైన అన్ని భవన యజమానులు నిర్ణీత గడువులోపు దరఖాస్తు చేసుకొని తమ భవనాలను క్రమబద్ధీకరించుకోవాలని కమిషనర్ కోరారు. 31–08–2025తర్వాత నిర్మించిన ఏ భవనం లేదా అంతస్తుకూ ఈ స్కీం వర్తించదని,అలా దరఖాస్తుచేస్తే సంబంధిత ఎల్‌టిపి, భవన యజమానిపై కఠినచర్యలు తీసుకుంటామని, దరఖాస్తు దాఖలు చేసిన తర్వాత కూడా భవనంలో మరేవిధమైన అనుమతిలేని కట్టడంచేస్తే, అలాంటి దరఖాస్తులను రద్దు చేస్తారని కమిషనర్ ధ్యానచంద్ర స్పష్టం చేశారు.

# ఆంధ్రరాష్ట్ర సాధన కోసం ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణాలను అర్పించిన మహా పురుషులు అమరజీవి పొట్టి శ్రీరాములు

## - రాష్ట్ర ఆర్యవైశ్య డైరెక్టర్ కొత్త కొండబాబు

## - ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు 73వ వర్ధంతి వేడుకలు

## - హాజరైన కొత్త కొండబాబు, అత్తులూరి నాగబాబు

జగ్గంపేట, సింహగర్జన ప్రతినిధి, డిసెంబర్ 15 : స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో జగ్గంపేట ఆర్యవైశ్య సేవా సంఘం ఆధ్వర్యంలో ఘనంగా అమరజీవి పొట్టి శ్రీరాములు 73వ వర్ధంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర ఆర్యవైశ్య వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్, జగ్గంపేట ఆర్యవైశ్య సేవా సంఘం అధ్యక్షుడు కొత్త వెంకటేశ్వరరావు (కొండబాబు), జగ్గంపేట ఎంపీపీ అత్తులూరి నాగబాబు ముఖ్య అతిథులుగా హాజరై పొట్టి శ్రీరాములు, మహాత్మా గాంధీ విగ్రహాలకు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కొత్త కొండబాబు మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం 58 రోజులు నిరాహార దీక్ష చేసి ప్రాణాలర్పించిన అమరజీవి పొట్టి శ్రీరాములు అని భాష ప్రయుక్త రాష్ట్రాల కోసం పాటుపడిన వ్యక్తి అని



ఆయన సేవలను కొనియాడారు. కూటమి ప్రభుత్వం ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అమరజీవి పొట్టి శ్రీరాములు స్మృతి వనం ఏర్పాటు చేసి 58 అడుగుల కాంస్య విగ్రహం కూడా రాష్ట్ర రాజధాని అమరావతిలో ఏర్పాటు చేయడం జరుగుతుందని, వాసవి మాత ఆత్మార్పణ దినాన్ని అధికారిక కార్యక్రమంగా ప్రకటించిన వారికి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని అన్నారు. వాసవి డిస్టిక్ గవర్నర్ మానేపల్లి బంగారాజు, బోండా వీర సత్య, బోండా నూకబాబు, కొత్త శ్రీరామకృష్ణ, కంచర్ల శ్రీను, చిత్రపు బాబు, వి.నాగసత్య, బి.జగన్ (బంక్), ఎస్.వెంకన్న బాబు, ఎం.రామానుజ, పొట్టి రాజేష్, నిట్టల శ్రీనివాస్, ఉదయగిరి తాతబాబు తదితరులు పాల్గొన్నారు.



# 1990-93వ సంవత్సరం డిగ్రీ బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

చోడవరం, సింహగర్జన ప్రతినిధి, డిసెంబర్ 15 : చోడవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదువుకున్న 1990–93 పూర్వ విద్యార్థులు ఆంతా బుడ్డిగ అప్పారావు, నాగజ్యోతిల అధ్యక్షతన ఎం.నాగేశ్వరరావు, కె.రమణ, సాగర్ మరియు ముత్యాల నాయుడు ఆధ్వర్యంలో అనకాపల్లి జిల్లా కశింకోట మండలం బయ్యవరం దగ్గరలో గల శారదా ఉద్యనవనంలో ఒకచోట కలిశారు. ఈ సందర్భంగా పూర్వవిద్యార్థులు అందరూ ఒకరి నొకరు ఆప్యాయంగా పలుకరించుకుంటూ చిన్ననాటి స్మృతులను గుర్తుచేసుకున్నారు. కళాశాలలో చదువుకున్న జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ప్రస్తుతం కుటుంబ స్థితిగతులను తెలుసుకుంటూ ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆనందంగా గడిపారు. ఈ సందర్భంగా బుడ్డిగ అప్పారావు మాట్లాడుతూ గత 13 సంవత్సరముల నుండి అనగా 2013వ సంవత్సరం నుండి నేటి వరకు దిగ్విజయంగా ప్రతి సంవత్సరం డిసెంబర్ రెండవ ఆదివారం ఆత్మీయ సమ్మేళనం జరుపుకోవడం చాలా ఆనందదాయకంగా ఉందని తెలిపారు. అదేవిధంగా ఎం.నాగేశ్వరరావు, కె.రమణ, సాగర్ మరియు ముత్యాల నాయుడు మాట్లాడుతూ ప్రతి ఒక్క మిత్రునికి ఫోన్లు ద్వారా మెసేజ్లు ద్వారా సమాచారం అందిస్తున్నామని, మా యొక్క సమాచారాన్ని మన్నించి వచ్చిన ప్రతి సోదరీ సోదరీమణులకు మా యొక్క ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని ఈ సందర్భంగా తెలిపారు.

# సత్యదేవుడి సన్నిధిలో వేడుకగా మెట్లోత్సవం

## - పసుపు,కుంకుమలు పూసేందుకు తరలివచ్చిన మహిళలు

అన్నవరం, సింహగర్జన ప్రతినిధి, డిసెంబర్ 15 : ప్రముఖ పుణ్యక్షేత్రం అన్నవరం శ్రీ సత్యదేవుడి సన్నిధిలో సోమవారం మెట్లోత్సవ కార్యక్రమం అత్యంత వేడుకగా జరిగింది. ఉదయం 7 గంటలకు కొండపై నుంచి స్వామి, అమ్మవార్లను పల్లకీలో కొండదిగువకు తీసుకునివచ్చి గ్రామోత్సవం నిర్వహించారు. 9.30కి తొలిపావంచా వద్ద పల్లకీలో స్వామి, అమ్మవార్లకు ప్రధానార్చకులు కోట సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో పండితులు గణపతిపూజ, పుణ్యాహవచనం అనంతరం స్వామివారి అష్టోత్తర శతనామాలతో పూజలు నిర్వహించారు. చతుర్వేదపండితుల వేదాశీర్వచనాలు అందజేశారు. అనంతరం తొలిమెట్టు వద్ద చైర్మన్ ఐ.వి.రోహిత్, ఈవో త్రినాథరావు హారతులివ్వగా మహిళలు పసుపు, కుంకుమలతో మెట్టు మెట్టుకు పూశారు. ముందు



పల్లకీలో స్వామి అమ్మవార్లను మేళతాలాలతో తీసుకెళ్లగా పల్లకీవెంట మహిళలు హారతులు వెలిగించి పటికబెల్లం నివేదన చేసుకుంటూ ప్రధానాలయానికి చేరుకున్నారు. పీఆర్వో అనకాపల్లి ప్రసాద్, ఏఈవోలు దామెర కృష్ణారావు, పెండ్యాల భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు

# నాదెండ్ల ఎస్సైగా వెంకటేశ్వర రావు

నాదెండ్ల

నాదెండ్ల నూతన ఎస్సై గా ఆర్. వెంకటేశ్వర రావు నేడు బాధ్యతలు చేపట్టారు. గత ప్రభుత్వంలో గ్రామ సచివాలయ ఉద్యోగిగా ఎంపికై, యడ్లపాడు మండలం ఉన్నవ గ్రామ సచివాలయంలో ఇంజనీరింగ్ సహాయకులుగా పనిచేస్తూ, ఈ ప్రభుత్వంలో ఎస్సైగా ఎంపికయ్యారు. సత్తెనపల్లి రూరల్ పోలీసు స్టేషనులో పిఎస్సైగా పనిచేస్తున్న ఈయనకు తొలి నియామకం నాదెండ్ల పోలీసు స్టేషను అయింది. ఈ సందర్భంగా స్టేషను సిబ్బంది ఆయన ఘన స్వాగతం పలికి, శుభాకాంక్షలు తెలిపారు. పలువురు గ్రామ సచివాలయాల సిబ్బంది వెంకటేశ్వరరావును కలిసి అభినందనలు తెలిపారు.








# అట్టహాసంగా ఆరంభమైన "అమ్మా... నాకు ఆ అబ్బాయి కావాలి!!"

**-ప్రముఖ మహిళా వ్యాపారవేత్త జి.శైలజా రెడ్డి నిర్మాతగా, శివాల ప్రభాకర్ దర్శకత్వంలో!!-**



హైదరాబాద్, సింహగర్జన ప్రతినిధి, డిసెంబర్ 15 : తెలుగు చిత్రసీమలోకి మరో మహిళా నిర్మాత అరంగేట్రం చేస్తున్నారు. ఆమె పేరు "జి. శైలజా రెడ్డి". సీనియర్ దర్శకుడు శివాల ప్రభాకర్ దర్శకత్వంలో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న ఈ చిత్రం పేరు "అమ్మా... నాకు ఆ అబ్బాయి కావాలి". జి.ఎస్.ఆర్. మూవీ మేకర్స్ పతాకంపై భారీ తారాగణంతో రూపొందుతున్న ఈ చిత్రంతో యువ కిశోరం పవన్ మహావీర్ హీరోగా పరిచయమవుతున్నాడు. సుహాన - మేఘశ్రీ హీరోయిన్లు. సీనియర్ నటులు సుమన్, రావు రమేష్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. శ్రీలక్ష్మి శైలజ ఈ చిత్రాన్ని సమర్పిస్తున్నారు!! ఈ చిత్రం ప్రారంభోత్సవం హైదరాబాద్ లోని సారధి స్టూడియోలో అత్యంత ఘనంగా జరిగింది. హీరో హీరోయిన్లపై చిత్రీకరించిన ముహూర్తపు సన్నివేశానికి రచనా బాహుబలి వి.విజయేంద్రప్రసాద్ క్లాప్ కొట్టగా... నిర్మాతల మండలి అధ్యక్షుడు కె.ఎల్.దామోదర్ ప్రసాద్, దర్శకుల సంఘం అధ్యక్షుడు వీర శంకర్ గౌరవ దర్శకత్వం వహించారు. సీనియర్ ఐ.పి.ఎస్. అధికారి ఘట్టమనేని శ్రీనివాస్ కెమెరా స్విచాన్ చేశారు. ప్రముఖ దర్శకులు రేలంగి నరసింహారావు, ప్రముఖ నిర్మాతలు తుమ్మలపల్లి రామసత్యనారాయణ, శోభారాణి, ప్రముఖ రచయిత జె.కె.భారవి తదితరులు ఈ వేడుకలో పాల్గొని నిర్మాతలను అభినందించారు. ఎల్.ఎన్.ఆర్. - జి.సాయి పద్మారెడ్డి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్స్ గా వ్యవహరిస్తున్న ఈ చిత్రానికి పి.ఆర్.ఓ : ధీరజ్ - అప్పాజీ, ప్రొడక్షన్ మేనేజర్ : బాలరాజు, కో-డైరెక్టర్ : రావుశ్రీ, సమర్పణ : శ్రీలక్ష్మీ శైలజ, నిర్మాత : జి.శైలజారెడ్డి, కథ - మాటలు - స్క్రీన్ ప్లే -, దర్శకత్వం : శివాల ప్రభాకర్!!






# ఇది ట్రైలర్ మాత్రమే... అసలు సినిమా ధురంధర్-2లో ఉంటుంది: మాధవన్

**-రూ. 550 కోట్లకు పైగా వసూళ్లతో దూసుకెళుతున్న 'ధురంధర్'**

**-ఇది ట్రైలర్ మాత్రమేనంటూ సీక్వెల్‌పై హింట్ ఇచ్చిన మాధవన్**

**-వచ్చే ఏడాది మార్చి 19న 'ధురంధర్ 2' విడుదల**

**-2025లో అత్యధిక వసూళ్లు సాధించిన నాలుగో చిత్రంగా రికార్డ్**




బాలీవుడ్ స్టార్ రణ్‌వీర్ సింగ్ నటించిన 'ధురంధర్' చిత్రం బాక్సాఫీస్ వద్ద రికార్డులు సృష్టిస్తున్న వేళ, ఈ సినిమాలో ఇంటెలిజెన్స్ బ్యూరో డైరెక్టర్‌గా నటించిన మాధవన్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'ధురంధర్'ను కేవలం ట్రైలర్‌గా అభివర్ణించిన మ్యాడీ, అసలు సినిమా 'ధురంధర్ 2'లో ఉంటుందని తెలిపారు. సీక్వెల్‌లో రణ్‌వీర్ నటన మరో స్థాయిలో ఉంటుందని, తన పాత్రకు కూడా ప్రాధాన్యం పెరుగుతుందని చెప్పి అంచనాలు పెంచారు. 'ధురంధర్ 2' చిత్రాన్ని 2026 మార్చి 19న విడుదల చేసేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు.

డిసెంబరు 5న విడుదలైన ఈ స్పై యాక్షన్ థ్రిల్లర్, ఇప్పటివరకు ప్రపంచవ్యాప్తంగా రూ. 552 కోట్లకు పైగా వసూళ్లు సాధించి సంచలనం సృష్టించింది. ఈ భారీ విజయంపై హీరో రణ్‌వీర్ సింగ్ సోషల్ మీడియాలో స్పందిస్తూ, "అదృష్టానికి మంచి అలవాటు ఉంది. సమయానికి తగ్గట్టు అది మారుతూ ఉంటుంది. కానీ, ఓర్పు చాలా ముఖ్యం" అని వ్యాఖ్యానించారు. తన గత చిత్రాల ఫలితాల నేపథ్యంలో ఆయన ఈ పోస్ట్ పెట్టినట్టు తెలుస్తోంది.వాస్తవ సంఘటనల ఆధారంగా దర్శకుడు ఆదిత్య ధర్ ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. దాదాపు మూడున్నర గంటల నిడివి ఉన్నప్పటికీ, పటిష్టమైన కథనంతో ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. రణ్‌వీర్ సింగ్‌తో పాటు అక్షయ్ ఖన్నా నటనకు కూడా ప్రశంసలు దక్కుతున్నాయి. ఈ చిత్రాన్ని అల్లు అర్జున్ వంటి ప్రముఖులు కూడా మెచ్చుకున్నారు.ప్రస్తుతం 2025లో అత్యధిక వసూళ్లు సాధించిన భారతీయ చిత్రాల్లో 'ధురంధర్' నాలుగో స్థానంలో ఉంది.


# చీరకట్టులో అనసూయ రాజసం.. గ్లామర్ కవ్వింతలు!

బుల్లితెర నుంచి వెండితెరకు వచ్చి సక్సెస్ అయిన వారిలో అనసూయ భరద్వాజ్ టాప్ లిస్ట్ లో ఉంటారు. యాంకర్గా తన ప్రయాణం మొదలుపెట్టినా, ఇప్పుడు స్టార్ నటిగా ఇండస్ట్రీలో తనకంటూ ప్రత్యేకమైన ఇమేజ్ క్రియేట్ చేసుకున్నారు. ఒకవైపు సినిమాలు, మరోవైపు షోలతో బిజీగా ఉంటూనే.. సోషల్ మీడియాలో తన గ్లామర్తో ఎప్పుడూ ట్రెండింగ్లో ఉండటం ఈ బ్యూటీ స్పెషాలిటీ. తనదైన అందం, అభినయంతో తెలుగు ప్రేక్షకులలో చెరగని ముద్ర వేసుకున్నారు. లేటెస్ట్ గా అనసూయ తన ఇన్స్టాగ్రామ్లో షేర్ చేసిన ఫొటోలు ఇప్పుడు నెట్టింట సెగలు రేపుతున్నాయి. మెటాలిక్ బ్లూ, గోల్డ్ కలర్ కాంబినేషన్ ఉన్న పట్టుచీరలో ఆమె రాజసం ఉట్టిపడేలా కనిపిస్తున్నారు. దీనికి మ్యాచింగ్గా స్లీవ్లెస్ డిజైనర్ బ్లౌజ్ ధరించి, ట్రెడిషనల్ చీరకట్టులోనూ గ్లామర్ డోస్ ఏమాత్రం తగ్గలేదని నిరూపించారు. ఆమె లుక్ చూస్తుంటే క్లాసీగా ఉంటూనే ఎంతో గ్లామర్ గా, స్టైలిష్గా అనిపిస్తోంది. ఈ ఫొటోషూట్లో హైలెట్ ఆమె హెయిర్ స్టైల్ అనే చెప్పాలి. ఉంగరాల జుట్టును గాలికి వదిలేసి, ఆ కురుల





మాటున ఆమె ఇస్తున్న ఎక్స్ప్రెషన్స్ కుర్రాళ్ళను కట్టిపడేస్తున్నాయి. భారీ ఆభరణాల జోలికి వెళ్లకుండా, కేవలం పెద్ద డిజైనర్ చెవిపోగులు, చేతికి నల్లటి గాజులు ధరించి సింపుల్గా మెరిసిపోయారు. హిందీ పాట లిరిక్స్ను క్యాప్షన్గా పెడుతూ, తనలోని లవ్లీ యాంగిల్ను బయటపెట్టారు. కేవలం గ్లామర్ మాత్రమే కాదు, నటనలోనూ తనకు తానే సాటి అని అనసూయ ఎప్పుడో నిరూపించుకున్నారు. 'రంగస్థలం'లో రంగమ్మత్తగా, 'పుష్ప'లో దాక్షాయణిగా ఆమె చేసిన పాత్రలు అంత సులభంగా మర్చిపోలేం. విలక్షణమైన పాత్రలను ఎంచుకుంటూ, స్టార్ హీరోల సినిమాల్లో కీలక పాత్రలు పోషిస్తున్నారు. లేడీ ఓరియెంటెడ్ కథలను కూడా ఎంచుకుంటూ నటిగా తన పరిధిని రోజురోజుకూ పెంచుకుంటున్నారు. ప్రస్తుతం చేతి నిండా సినిమాలతో ఫుల్ బిజీగా గడుపుతున్నారు. సినిమా షూటింగ్లతో ఎంత బిజీగా ఉన్నప్పటికీ, సోషల్ మీడియాలో మాత్రం అనసూయ ఎప్పుడూ యాక్టివ్గా ఉంటారు. అప్పుడప్పుడు వెస్ట్రన్ వేర్లో షాక్ ఇస్తూనే, ఇలాంటి చీరకట్టులో అచ్చమైన తెలుగుదనాన్ని చూపిస్తూ ఫ్యాన్స్ను సర్ప్రైజ్ చేస్తుంటారు. ఈ ఫొటోలను చూసిన నెటిజన్లు ఆమె అందాన్ని పొగడ్తలతో ముంచెత్తుతున్నారు. వయసు పెరుగుతున్నా ఆమెలోని గ్లామర్, ఎనర్జీ ఏమాత్రం తగ్గలేదని పాజిటివ్ గా రియాక్ట్ అవుతున్నారు



Published and Owned by Yandra Sri Veera Venkata Suneel Kumar, Door No : 14-1-52, Beside Union Bank of India, Main Road, Pithapuram, Kakinada District, AP, Pin : 533450. Cell - 9966655091. Registration No : AP-03-0000025, Email ID : kumarjournalist555@gmail.com, Editor : Dr Suneelkumar Yandra, Chief Editor : Maddirala Roja, www.simhagarjana.com


STREE SHAKTHI
AWARDS
STREE SHAKTHI
PRATHIBA AWARDS 2025
CONGRATULATIONS
FAUSTER OYGEN MWALONGO
Cultural Ambassador & ICCR International Student
Stree Shakti Global Cultural Ambassador
Award 2025
22nd & 23th
DEC 2025
Malla Reddy University,
Hyderabad
PARTNERS
ROHEETH
PRINTERS
Digital
Verto
Go Digital Today
eventbrite
RED
FM 93.5
KANNAYA
ANDHRA FOCUS TELUGU DAILY
ఆంధ్రఫోకస్
తెలుగు దిన పత్రిక
Soma
Mansion
సింహగర్జన
www.simhagarjana.com